క్లుప్తంగా

ఏ నోట్లూ రద్దు కాలేదు


దాసరి బ్రహ్మయ్య, ఆంధ్రప్రగతి బీఎం

శ్రీశైలంప్రాజెక్ట్: ఇటీవల కాలంలో రూ.50, రూ100 పాత నోట్లు రద్దయ్యాయని తప్పుడు ప్రచారం జరుగుతోందని, ఏ నోట్లూ రద్దు కాలేదని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ దాసరి బ్రహ్మయ్య తెలిపారు. తప్పుడు ప్రచారం వలన ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వ్యాపారులు కూడా నోట్లను తీసుకోక ప్రజలను ఇబ్బంది పెడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఇది చట్ట విరుద్ధమని, ఆనోట్లను ఎవరైనా వ్యాపారలస్తులు తీసుకోక ఇబ్బంది పెడితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఏదైనా నోట్లను రద్దు చేస్తే కేంద్రప్రభుత్వ అనుమతితో రిజర్వ్‌బ్యాంక్ ప్రకటన చేస్తుందని, ఇది ప్రజలు గుర్తించాలని ఆయన తెలిపారు.

అక్రమ మద్యం తరలిస్తే కఠిన చర్యలు


కోళ్లబావాపురం వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

నందికొట్కూరు రూరల్ : ఇతర రాష్ట్రాల నుంచి ఎవరైనా అక్రమ మద్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సెబ్ డిప్యూటీ కమిషనర్ నాగ మద్దయ్య హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని కోళ్లబావాపురం వద్దనున్న అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును సందర్శించారు. ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికల నేపథ్యంలో పోలీసు సిబ్బంది గ్రామాలలో అక్రమంగా మద్యం నిల్వ ఉంచే ప్రదేశాలపై తనిఖీలు చేయాలని ఆదేశించారు. నిత్యం వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ పాత నేరస్తులపై నిఘా పెట్టాలని సూచించారు. అనంతరం ఆయన చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సెబ్ సీఐ సీతారామిరెడ్డి, ఎస్.ఐ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


అదృశ్యమైన శెట్టి ప్రతాప్(ఫైల్)

పాములపాడు: మండలంలోని చెలిమిల్ల గ్రామానికి చెందిన శెట్టి ప్రతాప్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు కేసు నమోదు చేశామని ఏఎస్‌ఐ యేసయ్య శనివారం తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల ఒకటో తేదీ నుంచి తన భర్త కనిపించడం లేదని స్వరూప అనే మహిళ ఫిర్యాదు చేసిందన్నారు. మతిస్థిమితం లేదని ప్రతి రోజూ ఉదయం ఇంటి నుంచి పాములపాడుకు వచ్చి రాత్రి 10 గంటల లోపు ఇంటికి తిరిగివచ్చేవాడని చెప్పినట్లు తెలిపారు. ఇప్పటి వరకు అతని ఆచూకీ లభించ లేదని స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

అన్నపూర్ణ ఆశ్రమంలో అన్నదానం


అన్న సంతర్పణ చేస్తున్న నిర్వాహకులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలదేవస్థాన పరిధిలోని అన్నపూర్ణ దేవి ఆశ్రమం, శివోహం టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలకు వచ్చే కన్నడ భక్తులకు ఉచిత సేవలు అందిస్తున్నారు. శనివారం ట్రస్ట్ వ్యవస్థాపకులు అంతిరెడ్డి అరవిందరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తేనీరు, అల్పాహారం, భోజనం దాతల సహకారంతో అందించారు. అలాగే భక్తులు సేదతీరేందుకు కూడా సౌకర్యాలను కల్పించినట్లు, ఉగాది పర్వదినం వరకు సేవలు అందిస్తామని అరవిందరెడ్డి తెలిపారు.

మహానందిలో కన్నడ భక్తుల సందడి


గొలుసును అప్పగిస్తున్న టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు

మహానంది: ఉగాది సమీపిస్తున్న నేపథ్యంలో మహానంది ఆలయం కన్నడ భక్తులతో కిటకిటలాడుతోంది. భక్తుల రద్దీకి అనుగుణంగా వేకువజాము నుంచే దర్శనం సౌకర్యం కల్పించారు. శనివారం వీకెండ్ కావడంతో మరింత రద్దీ పెరిగింది. భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వర, శ్రీ కోదండరామాలయం, వినాయక నంది, గరుడ నంది ఆలయాలను సందర్శించారు

బంగారు గొలుసు అప్పగింత

మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన కర్ణాటక రాష్ట్రానికి చెందిన శరణ్ స్థానిక కోనేరులో పుణ్యస్నానం ఆచరించే సమయంలో తన బంగారు గొలుసును పోగొట్టుకున్నాడు. బయటికి వచ్చిన తర్వాత గమనించిన ఆయన వెంటనే ఆలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు సిబ్బంది చేత వెతికించి అప్పగించారు.


లడ్డూ కౌంటర్ వద్ద బారులు తీరిన కన్నడ భక్తులు


క్షేత్ర పురవీధిలో కన్నడ భక్తులు

మల్లన్న క్షేత్రం భక్తజన సంద్రం

- కన్నడ భక్తులతో కిటకిటలాడుతున్న శ్రీగిరి
- నల్లమలలో పాదయాత్రగా తరలివస్తున్న కన్నడిగులు
- నిండిపోయిన క్యూలైనన్లు
- భక్తులకు అలంకార దర్శనానికి మాత్రమే అనుమతి


క్షేత్ర పురవీధుల్లో కన్నడ భక్తుల నృత్యాలు


పాదయాత్రగా తరలివస్తున్న కన్నడ భక్తులు

శ్రీశైలంటెంపుల్: ఉగాది ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీశైల క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. క్షేత్రంలో ఏవైపు చూసినా కన్నడ భక్తులతో కిటకిటలాడుతుంది. మల్లయ్యను కీర్తిస్తూ డప్పు వాయిద్యాలతో, యువకులు రంగులు చల్లుకుంటూ, భజనలు, ప్రత్యేక పూజలు చేస్తున్నారు. నల్లమల అటవీప్రాంతంలో పాదయాత్రగా వేలాది మంది కన్నడ భక్తులు శ్రీగిరి చేరుకుంటున్నారు.

భ్రమరాంబాదేవికి పుట్టింటి సారె

శ్రీశైల మహాక్షేత్రంలో కన్నడ భక్తుల సందడి నెలకొంది. వందలాది కిలోమీటర్ల నుంచి పాదయాత్ర చేసుకుంటూ శ్రీశైలంలో జరిగే ఉగాది మహోత్సవాలను తిలకించేందుకు తండోపతండాలుగా తరలివస్తున్నారు. తమ ఇంటి ఆడపడుచు అయిన భ్రమరాంబాదేవికి పుట్టింటి సారె (పసుపు, గాజులు, కుంకుమ, తమ పొలాలలో పండిన పంట) తీసుకుని శ్రీగిరి చేరుకుంటున్నారు. అంతేకాకుండా మల్లికార్జున స్వామి స్వరూపంగా భావించే పల్లకీని మోసుకుంటూ శివనామస్మరణతో మల్లన్న చెంతకు చేరుకుంటున్నారు. వేకువజామునే పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనానికి బారులు తీరారు. భక్తుల రద్దీతో ఆలయ ఉచిత, రూ.200, రూ.500 క్యూలైన్లు నిండిపోయాయి. భక్తులందరికీ సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు అలంకార దర్శనానికి మాత్రమే అనుమతిస్తున్నారు. క్యూలైన్లలో, కంపార్ట్‌మెంట్లలో వేచిఉన్న భక్తులకు మంచి నీరు, అల్పాహారం, మజ్జిగ అందజేస్తున్నారు. వృద్ధులు, మహిళలు, చంటిపిల్లల తల్లులు సైతం నల్లమల అటవీప్రాంతంలో పాదయాత్రగా తరలివస్తున్నారు. కన్నడ భక్తుల పాదయాత్రతో నల్లమల కొండల్లో శివనామస్మరణ మారుమోగుతుంది. పాదయాత్ర భక్తులకు దేవస్థానం విస్తృత సౌకర్యాలు కల్పిస్తుంది. భక్తుల రద్దీతో శ్రీశైలక్షేత్ర పురవీధులన్నీ కిటకిటలాడుతున్నాయి.

బాధితులకు 'రెడ్ క్రాస్' చేయూత


వంట సామగ్రి అందజేస్తున్న తహసీల్దార్ విజయకుమారి

వెలుగోడు: స్థానిక శంకర్ నగర్‌లో ఇటీవల అగ్ని ప్రమాదంలో బుడ్డమ్మ అనే మహిళకు చెందిన గుడిసె కాలిపోయింది. విషయాన్ని రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ దస్తగిరి దృష్టికి స్థానిక నాయకులు తీసుకెళ్లారు. ఈ మేరకు రెడ్ క్రాస్ సొసైటీ తరపున బాధితురాలికి టార్పాలిన్ పట్టా, చీరలు, వంట పాత్రలు మంజూరు చేశారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విజయ కుమారి చేతుల మీదుగా బాధితురాలికి ఈ వస్తువులను పంపిణీ చేశారు. రెడ్ క్రాస్ సొసైటీ నాయకులు మునురుద్దీన్, నాగశేషులు, బండి ఆత్మకూరు, పాములపాడు నాయకులు శ్రీనివాసులు, మణిరాజు, నాయక్, వీఆర్వో చక్రి పాల్గొన్నారు.

మహానంది: బండిఆత్మకూరు మండలం కడమల కాల్వ గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు రెడ్‌క్రాస్ అండగా నిలిచింది. మైనార్టీ నాయకులు ఇస్మాయిల్ విజ్ఞప్తి మేరకు శనివారం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు దస్తగిరి, సభ్యులు షరీఫ్ ఆధ్వర్యంలో ఐదు కుటుంబాల వారికి రూ.60వేల విలువ చేసే వంట సామగ్రి, దుప్పట్లు, ఇంటి సామాగ్రి అందించారు.

తొలగని పోస్టర్


సోలార్ ఫెన్సింగ్‌కు అతికించి ఉన్న టీడీపీ అభ్యర్థి పోస్టర్

జూపాడుబంగ్లా: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి పక్షం రోజులైనా మండల కేంద్రమైన జూపాడు బంగ్లాలో పోలీసుస్టేషన్‌కు ఎదురుగా టీడీపీ నాయకుని పోస్టర్ తొలగించకపోవడంతో పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

చంద్రబాబు కుట్రలను తిప్పికొట్టాలి

- ఇచ్చిన హామీలను అమలు చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి
- ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్


ఎర్రమఠం గూడెంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: చంద్రబాబు కుట్రలను ప్రజలు ఓటు అనే వజ్రాయుధంతో తిప్పి కొట్టాలని, దేశంలోనే ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్ అన్నారు. ఒక్కసారి అవకాశం ఇవ్వండి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి బాటలో నడిపిస్తానని కోరారు. శనివారం నాగంపల్లి సొసైటీ చైర్మన్ గౌరు జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో జానాల గూడెం, సిద్ధేశ్వరం, బలపాలతిప్ప, ఎర్రమఠం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఓట్లు సమీపిస్తున్న తరుణంలో మళ్లీ మోసపూరిత హామీలతో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజల ముందుకు వస్తున్నారన్నారు. 14 సంవత్సరాల ముఖ్యమంత్రి పదవిలో ఉండీ ఏమీ చేయలేదన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలే జగన్‌మోహన్ రెడ్డి గెలుపుకు నాంది అన్నారు. మీ కుటుంబంలో మంచి జరిగిందని అనుకుంటే ఓటు వేయాలని అడిగిన ముఖ్యమంత్రి చరిత్రలో ఎవరైనా ఉన్నారంటే అది కేవలం జగనన్నే అన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రజలకు ప్రస్తుత సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవాలి పిలుపునిచ్చారు. అంతకు మునుపు ఆయన వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ప్రాచీన సంగమేశ్వరాలయాన్ని సందర్శించి వేపదారు శివలింగానికి విశేష పూజాకార్యక్రమాలు చేసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కే సుధాకర్ రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ నాగలక్ష్మిరెడ్డి, కో- ఆప్షన్ మెంబర్ మహ్మద్ గౌస్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగ ఎల్లయ్య, సర్పంచులు బాల ఎల్లయ్య, విజయ్ కుమార్, మారెన్న, మాజీ సొసైటీ చైర్మన్ రామ సుబ్బారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల ప్రచారానికే పవర్ తగ్గింది

- ఏపీ శాప్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి
- పిఠాపురంలో ప్రచారానికి శ్రీకారం చుట్టిన పవన్‌కు జ్వరం వచ్చింది
- ఎండను తట్టుకోలేని ఆయన కార్యకర్తలకు అండగా ఎలా ఉంటారు ?


సుబ్బారావుపేటలో ఇంటింటి ఎన్నికల ప్రచారం చేపట్టిన బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: రెండు రోజుల పాటు చేసిన ప్రచారానికే పవన్‌కు పవర్ తగ్గితే జనసేన కార్యకర్తలకు ఎలా అండగా ఉంటారని శాప్ రాష్ట్ర చైర్మన్, రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ప్రశ్నించారు. శనివారం పట్టణంలోని సుబ్బారావు పేటలో రెండో రోజు ఇంటింటికీ అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మీ కుటుంబానికి మేలు జరిగింటే వైఎస్ జగనన్నను మళ్లీ సీఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గంలో రెండు రోజుల పాటు వడగాలులకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తట్టుకోలేక ఫీవర్ వస్తే పార్టీని ఎలా నడుపుతారన్నారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేస్తుంటే చూసిన చంద్రబాబుకు వణుకు పుట్టిందని చెప్పారు. నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి పేదల పిల్లలకు ఉచితంగా ఇంగ్లిష మీడియం తీసుకోస్తే చంద్రబాబు జీర్ణించుకోలేక కోర్టుకెళ్లారని గుర్తు చేశారు. సామాజిక పింఛన్ల పంపిణీపై చంద్రబాబు దుర్మార్గంగా వ్యవహరించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రావణుడిలా మారువేషంలో ప్రజల వద్దకు వస్తున్న చంద్రబాబుకు ఓటుతో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగనన్నను, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్‌ను ఆశీర్వాదించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు చింత లక్ష్మీదేవి, సుమలత, సురేష్, లాలు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్, నాయకులు శివరామకృష్ణారెడ్డి, మాధురి, సులోచన, ఉస్మాన్‌బేగ్, సత్యనారాయణ, ఆర్ట్ శ్రీను, రజనీకుమార్‌రెడ్డి, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరి వెంటే భూబకాసురుడు


నాగలూటి గ్రామ పర్యటనకు విచ్చేసిన నారా భువనేశ్వరి వెంట మాండ్ర శివానందరెడ్డి

నందికొట్కూరు: భూ బకాసురుడు టీడీపీ నంద్యాల జిల్లా పార్లమెంట్ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డిని వెంటబెట్టుకుని తెలుగు దేశం పార్టీ నాయకురాలు, నారా చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి తిరుగుతున్నారు. మిడుతూరు మండలంలోని నాగలూటి గ్రామానికి విచ్చేసిన నారా భువనేశ్వరి వెంటే భూ బకాసురుడు మాండ్ర ఉన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని గజగజ వణికించిన నయీంతో మాండ్రకు సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ మండలం , బుద్వేల్ గ్రామంలో 282, 289, 291, 295 సర్వే నెంబర్లలోని 29 ఎకరాల అసైన్డ్ భూమిని ఆక్రమించుకున్న కేసుపై తెలంగాణ పోలీసులు అరెస్టు చేసేందుకు వచ్చారు. ఈ కేసుపై ఈ నెల 8వ తేదీ వరకు విచారణ చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

నాగలూటిలో స్వల్ప ఉద్రిక్తత

మిడుతూరు : నాగలూటి గ్రామంలో మృతిచెందిన టీడీపీకి చెందిన కార్యకర్త మాసుం కుటుంబ సభ్యులను నారా భువనేశ్వరి పరామర్శించేందుకు వెళ్తుండగా మాండ్ర శివానందరెడ్డి, బైరెడ్డి రాజశేఖరరెడ్డి వర్గియుల మధ్య తోపులాట చోటు చేసుకుంది.గమనించిన భువనేశ్వరి ప్రైవేటు సెక్యూరిటీ ఇరు వర్గాలను సర్ది చెప్పి సమస్యను సద్దుమణిగించారు.

పెద్ద నాగలూటిలో ఉచిత వైద్యశిబిరం

ఆత్మకూరు: ఉగాది పండగ సందర్భంగా శ్రీశైలంకు పాదయాత్రగా వెళ్తున్న కన్నడ భక్తులకు పెద్ద నాగలూటి వీరభద్రాచలం వద్ద బైర్లూటి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వారం రోజులుగా భక్తులకు మందులు ఇస్తూ, ఆరోగ్య సూచనలు వివరిస్తూ, మూడు షిఫ్ట్‌లలో 24 గంటలూ అందుబాటులో ఉండి వైద్యసేవలు అందిస్తున్నట్లు బైర్లూటి వైద్యాధికారి డాక్టర్ పవన్‌కుమార్ తెలిపారు. అత్యవసర చికిత్స అవసరమైన వారిని 108 వాహనంలో బైర్లూటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆత్మకూరుకు తరలించినట్లు తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్ ప్రవీణ్ కుమార్, ఆరోగ్య కార్యకర్తలు విశ్వనాథ్, భాస్కర్, 108 సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న శిల్పా భువనేశ్వర్‌రెడ్డి

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బ్రహ్మోత్సవాల విజయం పట్ల హర్షం ప్రకటించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దువ్వాడ భాస్కర్, రమణ, జయకృష్ణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అడవిలో అన్నపూర్ణ నిలయం


భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం


నల్లమలలో ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరం

- నల్లమల నట్టడవిలో మహారాష్ట్రీయుల అన్నదాన వితరణ
- లక్షల మంది కడుపునింపిన అన్నదాన శిబిరం

ఆత్మకూరురూరల్: ఒకరు.. ఒకరివెంట మరొకరు ..వారిననుసరించి మరిందరు... ఇలా సాగిపోతూనే ఉంటుంది మల్లన్న భక్తుల పాదయాత్ర. ఎక్కడో మహారాష్ట్ర - కర్ణాటక సరిహద్దులలో నుంచి బయలు దేరి ఉత్తర కన్నడ జిల్లాల నుంచి కదలి వచ్చే భక్తులను కలుపుకుంటూ అనంత జనవాహినిగా నల్లమలలో ప్రవేశించి, శిఖరాలను అధిగమించి శ్రీశైల శిఖర దర్శనంతో తమ జన్మ పావనమైందని పరవశించి పోతారు భక్తులు. అలా నడిచే వారు ఆకలిదప్పుల ఊసును మరచిపోతారు. కానీ ఆహారం లేకుండా ఉండటం అసాధ్యం కాబట్టి దారి పొడుగునా దాతలు సేవాభావంతో అన్నదాన శిబిరాలు ఏర్పాటు చేస్తుంటారు. అలాంటి వాటిల్లో ప్రధానమైనది మహారాష్ట్రలోని కొల్హాపూర్ తాలూకా, ఇచ్చలకరంజి కి చెందిన శ్రీశ్రీశైల మల్లికార్జున మల్టీ పర్‌పస్ ట్రస్ట్ వారు నిర్వహించే అన్నదాసోహ కార్యక్రమం. శ్రీశైల శిఖరాన్ని అధిరోహించే మెట్ల మార్గం చెంతనే ఉన్న నాగలూటి శ్రీవీరభద్రస్వామి ఆలయ సమీపంలో వీరు దీన్ని ఏర్పాటు చేసుకుని గత 14 సంవత్సరాలుగా సేవలందిస్తున్నారు. సుమారు 6 నుంచి 7 లక్షల పాదయాత్రికులు ఈ శిబిరంలో సేవలు పొందుతూ శ్రీశైలం వెళ్తారు. వారం రోజుల పాటు 24 గంటలూ వీరి అన్నదాన సేవా కార్యక్రమం సాగుతుంది. 300 మంది స్వచ్ఛంద సేవకులు ఈ కార్యక్రమాన్ని తమ భుజస్కందాలపై మోస్తారు. ట్రస్ట్ కార్యవర్గం అజమాయిషీలో లక్షలమంది కడుపు నింపుతుంది ఈ అన్నదాన శిబిరం.

అన్నదాన శిబిరానికి తప్పిన ముప్పు

ఆత్మకూరురూరల్: శ్రీశైల బ్రహ్మోత్సవాలకు తరలి వెళుతున్న కన్నడ పాదయాత్రికుల కోసం నల్లమల అడవుల్లోని నాగలూటి వీరభద్రాలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరం పై మామిడి కొమ్మలు విరిగి పడి ఒకరికి గాయాలయ్యాయి. శుక్రవారం రాత్రి సరిగా అన్నదాన శిబిరం పైన ఉండే పురాతన మామిడి చెట్టు కొమ్మ ఒకటి విరిగిపడింది. ఆ సమయంలో వందలమంది శిబిరంలో అన్న ప్రసాదం స్వీకరిస్తున్నారు. కొమ్మవిరిగిన శబ్దానికి అప్రమత్తమైన శిబిర నిర్వాహకులు శిబిరంపై పడకుండా ఆపేందుకు యత్నించారు. దీంతో కొమ్మ షామియానాపై నిదానంగా పడింది. ఈ క్రమంలో ఇచ్చలకరంజికి చెందిన రంగప్ప అనే వలంటీర్ కు స్వల్ప గాయాలయ్యాయి.

ఐక్యపోరాటాలతోనే కార్మిక రాజ్యస్థాపన

ఆత్మకూరు: కార్మికులు, ఉద్యోగులు, రైతులు ఐక్య పోరాటాలు చేసి కార్మిక రాజ్యస్థాపన ఏర్పాటు చేయాలని సీఐటీయూ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, అధ్యక్షులు యేసురత్నం అన్నారు. శనివారం పట్టణంలోని సుదర్శన వర్మ భవనంలో ఆత్మకూరు, నందికొట్కూరు డివిజన్లకు సంబంధించి ప్రాంతీయ రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. మొదటిరోజు జిల్లా నాయకులు భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుతం పెట్టుబడిదారి విధానం పెరిగిందని, కార్మికులపైన అదనంగా పని భారం మోపి లాభాలను ఆర్జిస్తున్నారన్నారు. సీఐటీయూ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రజాక్, రామ్‌నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, నాయకులు పాల్గొన్నారు.

కుటుంబాల మధ్య జరిగిన ఘటనను రాజకీయం చేయొద్దు


మాట్లాడుతున్న అలియాబేగం, భర్త అబ్దుల్ వహిబ్

నందికొట్కూరు: ఈ నెల 4వ తేదీన అర్ధరాత్రి రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘటనను ఆయా పార్టీలు రాజకీయం చేయొద్దని అలియాబేగం, భర్త అబ్దుల్ వహిబ్ కోరారు. శనివారం పట్టణంలోని సాయిబాబానగర్‌లో వారి స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విలేకరుల వారు మాట్లాడారు. పట్టణంలో హిందూ, ముస్లింలు అన్నదమ్ములుగా కలిసిమెలిసి ఉంటున్నాం. రాజకీయాల లబ్ధి కోసం ఇద్దరి మధ్య జరిగిన గొడవను రాజకీయ పార్టీలు ప్రచారానికి వాడుకోవద్దని హితవు పలికారు. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మాకు వారు న్యాయం చేశారు. మాకు అన్యాయం జరిగిందని న్యాయం చేయాలంటూ మీ వద్దకు వస్తే అప్పుడు మీరు మాట్లాడాలి. రాజకీయ పార్టీల నాయకులందరికీ చేతులు జోడించి మనవి చేస్తున్నాం. మా కుటుంబాన్ని రోడ్డుకు లాగొద్దు. నారా భువనేశ్వరికి, బైరెడ్డి శబరికి మేము చెప్పలేదు కదా. చెబుతేనే మా ఘటన గురించి మాట్లాడాలి. రాజకీయం కోసం మా కుటుంబాన్ని వాడుకోవద్దని కోరుతున్నా. సమావేశంలో సాధిక్ హుసేన్, తదితరులు పాల్గొన్నారు.

కైలాసద్వారం వద్ద రెడ్‌క్రాస్ వైద్యసేవలు


కన్నడిగులకు మందులు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

శ్రీశైలంప్రాజెక్ట్: ఉగాది మహోత్సవాలకు శ్రీశైలానికి కాలినడకన వస్తున్న కన్నడిగులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు కైలాస ద్వారం వద్ద ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు. ఎండలు అధికంగా ఉండడంతో కాలినడక భక్తుల కాళ్లు బొబ్బలు రావడం, నీరసించి పోతుండడంతో వారి గాయాలకు ఆయింట్‌మెంట్‌లు, శక్తి కోసం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను ఇస్తున్నారు. అలాగే ఒళ్లు నొప్పులు, జ్వరం, విరేచనాలు, ఇతర రోగాలకు మందులను పంపిణీ చేస్తున్నారు. వైద్యశిబిరంలో రెడ్‌క్రాస్‌సొసైటీ శ్రీశైలం బ్రాంచ్ చైర్మన్ నాగశేషయ్య, వైద్యులు విజయలక్ష్మి, కె.ప్రసాద్, సత్తార్, సొసైటీ సభ్యులు ఎస్.భాస్కర్, హరినాథరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు వైద్య సేవలు అందిస్తున్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్ కాలనీలో 'ఆరోగ్య సురక్ష'


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రాజెక్ట్ కాలనీలో గ్రామ సచివాలయం-2లో శనివారం రెండో విడత ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ప్రజలే కాకుండా ఉగాది మహోత్సవాలకు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి కూడా శిబిరంలో వైద్య, కంటి పరీక్షలు చేసి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు కూడా వారికి సేవలు అందించారు. 408 మంది వైద్యపరీక్షలకు రాగా వారికి వైద్య సేవలు అందించారు. అందులో 39మంది కంటిచూపు పరీక్షలు చేయించుకున్నారు. ఇద్దరికి మెరుగైన వైద్యం అవసరమని భావించి వీరిని నంద్యాల జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేశారు. గ్రామపంచాయితీ కార్యదర్శి బాలూ నాయక్, ప్రోగ్రాం అధికారి వరప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్లు ఎ.బొజ్జిరెడ్డి, ఆప్తమాలజీ అసిస్టెంట్ అసిస్టెంట్ షేక్షావలి, వైద్యసిబ్బంది నజీర్ అహ్మద్, సుమతి తదితరులు పాల్గొన్నారు.